సాక్షి
అనకాపల్లి
11
శనివారం ; 10 ; మే ; 2025

విశాఖ వాసుల్లో ఉద్విగ్న క్షణాలు



యుద్ధం ఉద్వేగం

రక్షణ కవచం 'ఈఎన్‌సీ'



ఘాజీ సముద్రమట్టంలో తూర్పు నావికాదళం సత్తా

రెండో ప్రపంచ యుద్ధంలో హార్బర్‌పై జపాన్ బాంబు దాడి

నాడు నిర్మించిన బంకర్లు నేటికీ సజీవ సాక్ష్యాలు

నాటి స్మృతులను గుర్తు చేసుకుంటున్న విశాఖ వాసులు

• 1942 ఏప్రిల్ 6వ తేదీ.. సూర్యోదయంతో పాటు మృత్యువు కూడా బాంబుల రూపంలో విశాఖ తీరాన్ని తాకింది. హార్బర్ వర్క్‌షాప్ బంకర్ సమీపంలో జపాన్ జారవిడిచిన బాంబు కారణంగా ఎనిమిది మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. బర్మాను జపాన్ ఆక్రమించిన వెంటనే.. విశాఖపట్నం తదుపరి లక్ష్యం అవుతుందని చాలా మంది ఊహించారు. ఈ బాంబు దాడితో నగరంలో భయాందోళనలు నెలకొని ప్రజలు ఊర్లకు తరలివెళ్లారు. ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన భవనాలను బ్రిటిష్ సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుని.. సైనిక కార్యకలాపాలకు ఉపయోగించుకుంది.

• 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో విశాఖపట్నం మరో కీలక ఘట్టానికి వేదికైంది. తూర్పునావికాదళం అమ్ములపొదిలోని ఐఎన్‌ఎస్ విక్రాంత్‌ను లక్ష్యంగా చేసుకుని డిసెంబర్ 4న పాకిస్తాన్‌కు చెందిన పీఎన్ఎస్ ఘాజీ సబ్‌మెరైన్ కరాచీ నుంచి సుమారు 4,800 కిలోమీటర్లు ప్రయాణించి విశాఖ తీరానికి చేరుకుంది. అయితే తూర్పు నావికాదళం అప్రమత్తతతో ఐఎన్ఎస్ రాజ్‌పుత్ చేతిలో ఘాజీ సబ్‌మెరైన్ తీరానికి కేవలం 2–2.5 కిలోమీటర్ల దూరంలోనే సముద్రం పాలైంది. ఈ ఘటనలో ఘాజీలోని 93 మంది సిబ్బంది జలసమాధి అయ్యారు. దీని అవశేషాలు 100 మీటర్ల లోతులో ఉన్నట్లు గుర్తించారు. ఈ చారిత్రక విజయానికి గుర్తుగా విశాఖ తీరంలో 'విక్టరీ ఎట్ సీ'స్మారక స్థూపం నిర్మించారు. ఐఎన్ఎస్ విక్రాంత్‌ను కాపాడుకోవడంలో తూర్పునావికాదళం చూపిన తెగువ చిరస్మరణీయం.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:



దేశంలో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో.. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే విశాఖపట్నం ఆ ప్రభావానికి లోనవుతోంది. 1971లో పాకిస్తాన్‌తో యుద్ధం సమయంలోనూ, రెండో ప్రపంచయుద్ధ సమయంలోనూ విశాఖపట్నం వార్తల్లో నిలిచింది. గత అనుభవాల దృష్ట్యా ప్రభుత్వం విశాఖపట్నంపై ప్రత్యేక దృష్టి సారించింది. 'ఆపరేషన్ సిందూర్‌'లో భాగంగా భారత బలగాలు తమ సత్తాను ప్రదర్శిస్తున్న వేళ.. విశాఖపట్నంలో ప్రజలను యుద్ధానికి సన్నద్ధం చేసేందుకు పలు ప్రాంతాల్లో విన్యాసాలు నిర్వహించారు. తూర్పు తీరంలో కీలకమైన స్థావరంగా ఉన్న విశాఖ తీరాన్ని తూర్పు నావికాదళం నిరంతర గస్తీతో సురక్షితంగా ఉంచుతుందనే విశ్వాసాన్ని నగర ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు తూర్పు నావికాదళం ఆధీనంలో ఉన్న అదే ఐఎన్ఎస్ విక్రాంత్ కరాచీ వైపు మోహరించిందనే వార్తలు నగర ప్రజల్లో నరనరాన ఉద్వేగాన్ని రగుల్చుతున్నాయి.

సివిల్ డిఫెన్స్ శిక్షణ

1971లో పాకిస్తాన్‌తో యుద్ధం అనివార్యమని స్పష్టమైన నేపథ్యంలో నగర ప్రజలను యుద్ధానికి సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా చిత్రాలయ సినిమా హాల్ సమీపంలోని మున్సిపల్ కార్యాలయంలో సివిల్ డిఫెన్స్ కార్యాలయాన్ని నెలకొల్పారు. యుద్ధం సంభవించినప్పుడు ఎలా వ్యవహరించాలనే దానిపై నగరవాసులకు ఇక్కడ శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా జాలరిపేట నివాసితులతో తూర్పు నావికాదళ అధికారులు నిరంతర సంప్రదింపులు జరిపారు. సముద్ర మార్గంలో ఎవరైనా కొత్త వ్యక్తులు పడవల్లో కనిపిస్తే తక్షణమే సమాచారం అందించాలని వారికి సూచించారు. జాలరిపేట వాసులకు ఈ విషయంలో ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. 'ఆ సమయంలో ఐఎన్ఎస్ విక్రాంత్ విశాఖ తీరానికి వచ్చిందని అప్పటి తూర్పు నావికాదళ వైస్ అడ్మిరల్ నీలకంఠ కృష్ణన్ ప్రచారం చేయించారు'అని ఎడ్వర్డ్ పాల్ వివరించారు. అంతే కాకుండా పప్పు దినుసులు, బియ్యం, కూరగాయలు, పాలు వంటి నిత్యావసరాలను నిల్వ చేసుకోవాలని మైకుల ద్వారా ప్రజలకు విస్తృతంగా తెలియజేశారు. యుద్ధ సన్నాహాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు లైట్లు ఆర్పేయడం(బ్లాక్ అవుట్) వంటి కార్యక్రమాలను కూడా నిర్వహించారు. ఈ సమాచారంతో ప్రజలు కిరోసిన్, కొవ్వొత్తులు కొనుగోలు చేసి దాచుకున్నారని పాల్ గుర్తు చేసుకున్నారు.



ఎడ్వర్డ్ పాల్

యుద్ధకాలపు అనుభవాలు





రెండో ప్రపంచ యుద్ధ సమయంలో విశాఖపై జపాన్ దాడి తప్పదని ముందుగానే ఊహించారు. 1942 జనవరిలో బర్మా, ఫిబ్రవరిలో సింగపూర్‌లను జపాన్ ఆక్రమించడంతో, వారి తదుపరి లక్ష్యం భారతదేశ తూర్పు తీరంలోని కీలక నగరమైన విశాఖపట్నం అని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో నగరంలోని యూరోపియన్లు రైళ్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. ముందు జాగ్రత్త చర్యగా విశాఖపట్నం అంతటా బంకర్లు నిర్మించారు. వీటిలో కొన్ని ఆర్‌కే బీచ్ పరిసరాలు, దస్‌పల్లా హిల్స్ ప్రాంతాల్లో ఇప్పటికీ చూడవచ్చు. రేషన్ సరుకులను నిల్వ ఉంచుకోరాదని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఆ సమయంలో నెలకొన్న పరిస్థితులను భారత జాతీయ సంస్కృతి వారసత్వ సంపద(ఇన్‌టాక్) సంస్థకు చెందిన ఎడ్వర్డ్ పాల్ 'సాక్షి'కి వివరించారు. 'దాడిని ఎదుర్కొనేందుకు నగరంలో సరైన ఆయుధ సంపత్తి లేదు. జపాన్ సైన్యం టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, పవర్ హౌస్‌లతో పాటు హార్బర్‌లోని నౌకలపై బాంబులు వేసింది. ఈ దాడిలో ఎనిమిది మంది మరణించారు. దాడి జరుగుతున్న సమయంలో, నౌకల్లోని పాత తుపాకులతో ఎదురుదాడికి ప్రయత్నించినా.. జపాన్ విమానాలు వాటి పరిధిలో లేకపోవడంతో అవి నిష్ఫలమయ్యాయి. పోర్టు నగరంపై దాడి జరుగుతుందని తెలిసినప్పటికీ తగిన ఆయుధాలను మోహరించలేదని ఇది స్పష్టం చేస్తుంది. ఆనాటి దాడిలో మరణించిన వారి పేర్లతో కూడిన శిలాఫలకాన్ని విశాఖపట్నం మ్యూజియంలో, అలాగే జారవిడిచిన ఒక పేలని బాంబును కూడా మ్యూజియంలో భద్రపరిచారు. ప్రజలు ఎడ్లబళ్లు, సైకిళ్లు, కాలినడకన నగరాన్ని విడిచి వెళ్లారు. అధికారులు మాత్రం తమ కుటుంబ సభ్యులను గ్రామాలకు పంపి.. విధుల్లో కొనసాగారు. ఆంధ్రా యూనివర్సిటీ భవనాలను ఖాళీ చేయించి బ్రిటిష్ సైన్యం వినియోగించుకుంది. యూనివర్సిటీని తాత్కాలికంగా గుంటూరు, విజయవాడలకు తరలించారు.' అని పాల్ వివరించారు. అయితే 1971 నాటి పాకిస్తాన్‌తో యుద్ధ సమయంలో విశాఖపట్నంపై పెద్దగా ప్రభావం పడలేదన్నారు. 1942 నాటి ఘటనతో విశాఖపట్నంనకు రెండు ప్రయోజనాలు చేకూరాయని పేర్కొన్నారు. నగరానికి వచ్చిన సైనిక బలగాల నీటి అవసరాలను తీర్చడానికి ఆర్మీ ఇంజినీర్లు గోస్తనీ తాగునీటి పథకాన్ని నిర్మించారు. రోజుకు 4 లక్షల గ్యాలన్ల నీటిని సరఫరా చేసే ఈ పథకాన్ని యుద్ధానంతరం మున్సిపాలిటీ వినియోగించుకుంది. అలాగే మేహాద్రి గెడ్డపై ఒక వంతెనను కూడా నిర్మించారని ఆనాటి సంగతులను పంచుకున్నారు.



మిలటరీ అప్పారావు



అగ్గాల అప్పారావును అందరూ మిలటరీ అప్పారావు అని పిలుస్తారు. 1965లో ఆర్మీలో చేరిన వెంటనే పాకిస్తాన్‌తో యుద్ధం వచ్చింది. 22 సంవత్సరాలు సేవలందించిన ఆయన 1971లో జరిగిన ఇండో పాకిస్తాన్ యుద్ధంలో కూడా పాల్గొన్నారు. మద్రాస్ రెజిమెంట్ సెవెంత్ బెటాలియన్‌లో విధులు నిర్వహించి శత్రువులను తరిమికొట్టారు. ఆనాటి జ్ఞాపకాలను ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు..

ప్రస్తుతమున్న టెక్నాలజీ అప్పట్లో లేకపోయినా దేశంపై ఉన్న మక్కువతో ప్రాణాలు తెగించి పోరాడాం. కళ్ల ముందే తోటి సైనికులు ప్రాణాలు కోల్పోతున్నా అధైర్యపడకుండా ముందుకు దూసుకుపోయేవాళ్లం. ఎక్కువగా ల్యాండ్‌మైన్స్ ఏర్పరచడంతో యుద్ధం సమయంలో 40 మంది జవాన్లకు అప్పట్లో కేవలం 10మంది మాత్రమే తిరిగి ఇంటికి సురక్షితంగా చేరుకునేవారు. యుద్ధాలు జరగడం వల్ల దేశాలు ఆర్థికంగా కొన్ని సంవత్సరాలు వెనుకబడిపోతాయి. అమాయక దేశ పౌరులపై కాల్పులు జరిపి పాక్ కయ్యానికి కాలు దువ్వుతోంది. దేశ సంరక్షణ కోసం ప్రస్తుతం ఎనిమిది పదుల వయస్సులో కూడా యుద్ధానికి సిద్ధంగా ఉన్నాను.

దేశం కోసం..


- యుద్ధ భూమిలో తండ్రీ కొడుకుల సేవలు
- ఇద్దరూ పాకిస్తాన్‌పై పోరాడినవారే..

ఎర్రవరం గ్రామానికి చెందిన అగ్గాల అప్పారావు.. ఆయన కుమారుడు హనుమంతరావు.. ఇద్దరూ ఆర్మీలో సేవలందించారు. పాక్ సైనికులను ఎదుర్కొన్నారు. మళ్లీ యుద్ధానికి సిద్ధమంటున్నారు. - అచ్యుతాపురం రూరల్



అగ్గాల అప్పారావు తనయుడు హనుమంతరావు కూడా అదే మద్రాస్ రెజిమెంట్‌లో పనిచేసి కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నారు. 74 రోజులపాటు పాకిస్తాన్‌తో పోరాడారు. యుద్ధభూమిలో అడుగు పెడితే దేశమే గానీ కుటుంబం గుర్తుకు రాదని, ప్రాణాలు పణంగా పెట్టడానికైనా సిద్ధంగా ఉంటామని ఆయన చెప్పారు. తన జ్ఞాపకాలను ఇలా నెమరువేసుకున్నారు..

1999 కార్గిల్ యుద్ధంలో పనిచేస్తున్నప్పుడు సోలార్ మిసైల్స్ ఉండేవి. వాటిపై ఎప్పుడైతే సూర్యకాంతి పడుతుందో ఆటోమెటిక్‌గా టార్గెట్ చేసిన స్థలానికి చేరుకుని పేలిపోయేవి. మేము ముందుగానే గ్రహించి యుద్ధం సమయంలో అతి చాకచక్యంగా అటువంటి ఎన్నో సోలార్ మిసైల్స్‌ను వెలికితీశాం. ఇంటెలిజెన్స్ ప్రతి సైనికునిపై నిఘా ఉంచుతుంది. సైనికుల విధి విధానాలపై అప్రమత్తత వహిస్తుంది. అచ్యుతాపురం మండలం నుంచి సుమారు 30 మంది మాజీ సైనికులం యుద్ధంలో చేరడానికి సిద్ధంగా ఉన్నామని పై అధికారులకు లేఖ పంపించాం.



కార్గిల్ యుద్ధ భూమిలో దాచిపెట్టిన సోలార్ మిసైళ్లను వెలికి తీసిన అగ్గాల హనుమంతరావు బృందం

మూడు యుద్ధాల్లో ఆరితేరిన యోధుడు



ఇండియన్ ఆర్మీ నుంచి అందుకున్న పతకాలతో రోకళ్ల అప్పారావు

కశింకోట: రోకళ్ల అప్పారావు.. భారత్‌తో పాకిస్తాన్, చైనా జరిపిన మూడు ప్రధాన యుద్ధాల్లో పాల్గొన్నారు. యుద్ధాలతో పాటు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఇండియన్ ఆర్మీ నుంచి పతకాలు పొందారు. శేష జీవితాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ఆది నుంచి ఆరోగ్యంతో ఆనందమయ జీవనాన్ని గడుపుతున్నారు. కశింకోటలోని స్టేట్ బ్యాంకు వీధి ప్రాంతంలో అప్పారావు కుటుంబంతో స్థిర నివాసం ఉంటున్నారు. 1955లో 14వ ఏట ఇండియన్ ఆర్మీలో చేరి సిపాయిగా వైర్‌లెస్ విభాగంలో ఆపరేటర్‌గా సేవలందించారు. 1962లో చైనాతోను, 1965, 71 సంవత్సరాల్లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధాల్లో విధులు నిర్వహించారు. తొలుత 1966 వరకు సేవలందించి విధుల నుంచి రిటైర్ అయ్యారు. మళ్లీ యుద్ధం రావడంతో ఇండియన్ ఆర్మీ అధికారుల నుంచి వచ్చిన పిలుపు మేరకు మరోసారి వెళ్లి 1971లో పాకిస్తాన్ యుద్ధంలో సేవలందించారు. జమ్మూ, కశ్మీర్, అస్సాం, రాజస్థాన్, గుజరాత్, జలంధర్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించి సేవలందించారు. మూడు ప్రధాన యుద్ధాలు చవి చూసి ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఆయన యుద్ధాల్లోను, సర్వీసులోను అందించిన సేవలకు గుర్తింపుగా ఇండియన్ ఆర్మీ పతకాలను అందజేసి గౌరవించింది. ఆర్మీ నుంచి రిటైర్ అయ్యాక సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలపై దృష్టి నిలిపారు. అప్పారావు సొంత గ్రామం ఎస్.రాయవరం మండలం లింగరాజుపాలెం. ఆర్మీలో చేరిన తర్వాత ఇక్కడికి వలస వచ్చి స్థిర నివాసం ఉంటున్నారు.

పాక్ తుక్కుగా ఓడిపోవడం ఖాయం

పాకిస్తాన్‌తో మళ్లీ యుద్ధం వస్తే భారత్ చేతిలో తుక్కుగా ఓడిపోవడం ఖాయమని అప్పారావు ధీమాగా చెప్పారు. సమృద్ధిగా ఆయుధ సంపత్తి, సాంకేతిక పరిజ్ఞానం భారత్‌కు ఉన్నాయన్నారు. ఆర్మీ నుంచి వచ్చిన తర్వాత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తన శేష జీవితాన్ని గడుపుతున్నానన్నారు.

న్యూస్‌రీల్

విభిన్న ప్రతిభావంతులకు ఉచిత డీఎస్సీ క్రాష్ కోర్స్

తుమ్మపాల: జిల్లాలో విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ క్రాష్ కోర్సు శిక్షణను విజయవాడలో నిర్వహించనున్నట్టు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు బి.ఆశయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దృష్టిలోపం, వినికిడి లోపం, ఆర్థోపెడిక్ తదితర విభిన్న ప్రతిభావంతులైన, ఎస్జీటీ టీచర్ పోస్టులకు అర్హతగల వారికి విజయవాడలో ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 40 శాతం వికలాంగత్వం ఉన్నవారు మాత్రమే అర్హులని, ఈ నెల 11వ తేదీలోగా mdfc.apefss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. టెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక బోధనా పద్ధతుల్లో శిక్షణ, స్టడీ మెటీరియల్ పంపిణీ, ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో డీఎస్సీకి అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వడదెబ్బతో మాజీ సర్పంచ్ మృతి



అప్పారావు(ఫైల్)

బుచ్చెయ్యపేట: మండలంలో పొట్టిదొరపాలెం మాజీ సర్పంచ్ బొబ్బిలి అప్పారావు (58) వడదెబ్బకు గురై మృతి చెందారు. శుక్రవారం పొలం పనులు చేస్తుండగా స్పృహ తప్పి పడిపోయారు. దీంతో కుటుంబ సభ్యు లు అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి 7 గంటల సమయంలో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం పొట్టిదొరపాలెంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇదివరకే భార్య మృతి చెందారు.

వెబ్‌సైట్‌లో టెన్త్ మార్కుల మెమోలు



గిడ్డి అప్పారావు నాయుడు, డీఈవో

అనకాపల్లి టౌన్: టెన్త్ విద్యార్థుల మార్కుల షార్ట్ మెమోలు వెబ్‌సైట్‌లో అందుబాటు లో ఉన్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్కుల మెమోలను ఆయా పాఠశాలల ప్రధానోధ్యాయులు డౌన్‌లోడ్ చేసి, విద్యార్థులకు అందజేయాలని సూచించారు. మార్కుల జాబితాలో పుట్టిన తేదీ, ఇంటిపేరు తదితర తప్పులు ఏమైనా ఉన్నట్టయితే అందుకు సంబంధించిన రికార్డులను ఈ నెల 25 లోపు అందజేసి సరిదిద్దుకోవాలన్నారు. ఒకసారి జారీ అయిన మార్కులలిస్టులో తప్పులను మళ్లీ సవరించే అవకాశం ఉండదని తెలిపారు.

హెచ్‌ఎస్‌ఎల్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డును అందుకుంటున్న హెచ్‌ఎస్‌ఎల్ డైరెక్టర్ కమడోర్ రాకేష్‌ప్రసాద్

విశాఖ సిటీ : హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(హెచ్ఎస్ఎల్) డిజిటల్ దిశగా అడుగులు వేయడంలో అత్యుత్తమ ప్రతిభకు మరోసారి గుర్తింపు లభించింది. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన 10వ పీఎస్‌యూ అవార్డుల ప్రదానోత్సవంలో హెచ్ఎస్ఎల్‌కు అవార్డు దక్కింది. సంస్థలో ఐటీ అప్లికేషన్లు, సంస్కరణలను విజయవంతంగా అమలు చేసినందుకు గాను ఐటీ సర్వీస్ మేనేజ్‌మెంట్ అవార్డును సొంతం చేసుకుంది. ఈ అవార్డును సంస్థ డైరెక్టర్(కార్పొరేట్ ప్లానింగ్ అండ్ పర్సనల్) కమడోర్ రాకేష్ ప్రసాద్ అందుకున్నారు.

11, 12 తేదీల్లో ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 11, 12 తేదీల్లో ఆర్జిత సేవలన్నీ రద్దు చేస్తున్నట్టు దేవస్థానం ఏఈవో ఎన్. ఆనంద్‌కుమార్ తెలిపారు. 11న స్వామి మాస జయంతి, 12న వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు. 12న నమ్మళ్వార్ తిరునక్షత్రం పూజలు, రెండో విడత చందనం సమర్పణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

అన్నదాత సుఖీభవకు ఈ-కేవైసీ చేయించుకోవాలి

తుమ్మపాల: అన్నదాత సుఖీభవ పథకం ద్వారా వ్యవసాయ పెట్టుబడి సాయం పొందేందుకు రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆధార్, బ్యాంక్ పాసుపుస్తకం, రేషన్ కార్డులను రైతు భరోసా కేంద్రాల వద్ద సిబ్బందికి అందించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడంతో పాటు ఈ నెల 20తేదీ నాటికి ఈ-కేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. రైతుసేవా కేంద్రం సిబ్బంది ఆన్‌లైన్‌లో ఉన్న రైతుల సమాచారాన్ని తనిఖీ చేసి ఆమోదిస్తారని తెలిపారు.

వీరు అనర్హులు... : ఈ పథకానికి మరణించిన వారు, రాజ్యసభ, శాసనసభ, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రస్తుతం, గతంలో పదవులు చేపట్టి ఉన్న వారు, ప్రస్తుతం,గతంలో ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పదవులు నిర్వహించినవారు, నెలకు రూ.పదివేలు, అంతకంటే ఎక్కువ పెన్షన్ తీసుకుంటున్న వారు, పని చేస్తున్న, పదవీ విరమణ పొందిన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు (నాల్గవ తరగతి, కింద స్థాయి ఉద్యోగులకు మినహాయింపు), గత ఏడాది ఆదాయపు పన్ను కట్టిన వారు, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, చార్టెడ్ అకౌంటెంట్లు, రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్న వారు, తమ భూమిని వ్యవసాయానికి కాకుండా ఇతర ప్రయోజనాలకు ఉపయోగించిన వారు (ఇళ్ల స్థలాలకు, చేపల పెంపకానికి), కుటుంబ సర్వేలో పేరు లేకుండా ఇక్కడ భూమి కలిగి ఉండి వేరే రాష్ట్రంలో నివాసం ఉంటున్నవారు అనర్హులు అని ఆయన తెలిపారు.

విశాఖ డెయిరీ పాల ధరల పెంపు



విశాఖ డెయిరీ పాలు, పాల పదార్థాలు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ డెయిరీ పాల ధరలను పెంచుతున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. పెరిగిన ధరలు శనివారం నుంచి అమల్లోకి వస్తాయి. హోమోజినైజ్డ్ డబుల్ టోన్డ్ పాలు(500 మి.లీ) రూ.25 నుంచి రూ.26కు, హోమోజినైజ్డ్ డబుల్ టోన్డ్ పాలు(లీ) రూ.50 నుంచి రూ.52కు, హోమోజినైజ్డ్ టోన్డ్ పాలు (500 మి.లీ) రూ.27 నుంచి రూ.28కు, హోమోజినైజ్డ్ టోన్డ్ పాలు(లీ) రూ.54 నుంచి రూ.56కు, టోన్డ్ పాలు (500 మి.లీ) రూ.27 నుంచి రూ.28కు, స్టాండరైజ్డ్ పాలు(500 మి.లీ) రూ.30 నుంచి రూ.31కు, ఫుల్ క్రీమ్ పాలు (500 మి.లీ) రూ.32 నుంచి రూ.33కు, ఫుల్ క్రీమ్ పాలు (లీ) రూ.63 నుంచి రూ.66కు, హోమోజినైజ్డ్ టోన్డ్ పాలు-గంగ (500 మి.లీ) రూ.28 నుంచి రూ.29కు, హోమోజినైజ్డ్ డబుల్ టోన్డ్ పాలు-గంగ(500 మి.లీ) రూ.26 నుంచి రూ.27కు, టోన్డ్ పెరుగు (180 గ్రా.) రూ.14 నుంచి రూ.15కు, టోన్డ్ పెరుగు (కిలో) రూ.64 నుంచి రూ.66కు, డబుల్ టోన్డ్ పెరుగు (900 గ్రా.) రూ.54 నుంచి రూ.56కు పెరిగినట్లు యాజమాన్యం తెలిపింది.

ముగిసిన వేంకటాద్రి బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు



వేంకటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా ముగిశాయి. ఆఖరి రోజు శుక్రవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానం జరిపారు. సాయంత్రం దేశం, రాష్ట్రం నలుమూలల నుంచి రప్పించిన వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం జరిపారు. స్వామివారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవ జరిపారు. అనంతరం వేద మంత్రోచ్చరణలతో మహా పూర్ణాహుతితో ఉత్సవాలు వేడుకగా ముగిశాయి. ఆలయ అర్చకుడు మహర్షి శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో ఈవో నీలిమ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూకాంబిక సన్నిధిలో 'ఓ భామ అయ్యో రామ' చిత్ర బృందం



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న ఓ భామ అయ్యో రామ చిత్ర బృందం సభ్యులు

అనకాపల్లి టౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారిని 'ఓ భామ అయ్యో రామ'చిత్ర బృందం సభ్యులు శుక్రవారం దర్శించుకున్నారు. సుహాస్, మాళవిక హీరో, హీరోయిన్‌లుగా తెరకెక్కించిన ఈ చిత్రం జూన్ నెలలో విడుదల అవుతున్న సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు రామ్, గంగాధర్, శ్రీ బ్రాహ్మిత్, తదితరులు పాల్గొన్నారు.

నేను పీకే తాలుకా.. తలచుకుంటే లేపేస్తా...!

- ఓ వైద్యుడిపై పవన్ కల్యాణ్ అభిమాని వీరంగం
- ప్రశ్నించినందుకు దౌర్జన్యం

డాబాగార్డెన్స్(విశాఖ): నేను పవన్ కల్యాణ్ తాలూకా? నీవెవ్వడివిరా? నేను తలచుకుంటే లేపేస్తా.' అంటూ ఓ వైద్యుడిపై పీకే అభిమాని విరుచుకుపడ్డాడు. ఆ వైద్యుడు కన్నీటితో తన ఆవేదనను సాక్షి వద్ద వెలిబుచ్చాడు. ఏం జరిగిందో ఆయన మాటల్లోనే..పాతనగరం ఫిషింగ్ హార్బర్ వద్ద హోమియో క్లినిక్ నడుపుతున్నా. మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో క్లినిక్ మూసి, ఇంటికి వెళ్తున్న సమయంలో ఓ అభాగ్యురాలు తన చంటి పిల్లలతో మండుటెండలో ఆకలితో అలమటిస్తుంటే.. బిస్కెట్స్, కూల్ డ్రింక్స్ ఇచ్చాను. ఆనందంగా స్వీకరించిన పిల్లలు సమీపంలోని మరిడిమాంబ ఆలయం షెల్టర్ వద్దకు తినుకుంటూ వెళ్లడంతో ఓ ద్విచక్ర వాహనదారుడు స్పీడ్ వచ్చి షడన్ బ్రేక్ వేశాడు. 'ఎందుకు అంత స్పీడ్? కొంచెం నెమ్మదిగా వెళ్లొచ్చు కదా.. అని ప్రశ్నించా..అంతే ఆ యువకుడు రెచ్చిపోయి.. 'నేను పవన్ కల్యాణ్ తాలూకా.. నీవెవ్వడివిరా నన్ను ప్రశ్నిస్తున్నావ్? నేను తలచుకుంటే లేపేస్తా' అంటూ దౌర్జన్యం చేశాడని డాక్టర్ రియాజ్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశాడు.

స్పీడ్ బ్రేకర్లు వేస్తే సమస్యే ఉండేది కాదు..

ఈ ప్రాంతంలో ఓ వైపు మరిడిమాంబ ఆలయం .. కొంత దూరంలో యాసీన్ బాబా దర్గా ఉన్నాయి. ఇటు మరిడిమాంబ ఆలయానికి వెళ్లే భక్తులు, యాసీన్ బాబా దర్గాకు వచ్చే ముస్లింలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఇటుగుండానే వెళ్తుంటారు. ద్విచక్ర వాహన చోదకులు స్పీడ్‌గా వెళ్తున్న నేపథ్యంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని డాక్టర్ రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు.



ఏపీ సమీకృత వ్యవసాయ పథకంలో భాగంగా చెరువు నిర్మాణ పనులు (ఫైల్)

చెరువు..బరువు

కుంటుపడిన రైతు బతుకు తెరువు

వర్షపు నీటిని ఒడిసి పట్టి వ్యవసాయానికి అనుకూలంగా మార్చుకోవాలి. చెరువు ఆయకట్టు శివారు పంట పొలాలకు సైతం సాగునీరు అందేలా చెరువులను అభివృద్ధి, ఆధునికీకరణ చేసుకోవాలి. అప్పుడే పల్లెల్లో చెరువులు సైతం వ్యవ'సాయం'గా మారుతాయి. ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సాయంతో 'ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం'లో భాగంగా చెరువుల అభివృద్ధికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టును 2025 నాటికి పూర్తి చేయాలని శరవేగంగా పనులు చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఈ పనులు మందగించాయి. వేసవి కాలంలోనే చెరువులను అభివృద్ధి చేస్తే వచ్చే వర్షాకాలంలో సాగుకు సరిపడా నీటిని నిల్వ చేసుకోవచ్చు. కానీ ప్రస్తుత సర్కారు ఆ దిశగా ఆలోచించడం లేదు.

- కూటమి ప్రభుత్వంలో చెరువుల ఆధునికీకరణకు గ్రహణం
- సమీకృత వ్యవసాయ పరివర్తన పథకం ప్రవేశపెట్టిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- జిల్లాలో 50 సాగునీటి చెరువులను అభివృద్ధి చేయాలన్నది నాటి ప్రతిపాదన
- ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆధునికీకరణకు నోచుకోని వైనం
- రూ.33.46 కోట్ల ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయంతో నిర్మాణ పనులు
- ఇవి పూర్తయితే 7,232 ఎకరాల ఆయకట్టుకు అందనున్న సాగునీరు



పిజో మీటర్ డ్రిల్లింగ్ చేసి నీటి సాంద్రత కొలుస్తున్న అధికారులు (ఫైల్)



చెరువు పనులు చేయిస్తున్న అధికారులు

సాక్షి, అనకాపల్లి: మనవి దాదాపు వర్షాధార భూములు. వానలు పడితేనే పంట పండుతుంది. రైతు ఇంట ఆనందం వెల్లివిరుస్తుంది. తగిన నీటి సదుపాయం ఉంటే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందడానికి ఆస్కారం ఉంటుంది. అందుకే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగేలా చెరువుల అభివృద్ధి, ఆధునికీకరణకు శ్రీకారం చుట్టింది. సాగునీటి ఇబ్బందులు తొలగించడానికి ఏపీ సమీకృత సేద్య, వ్యవసాయ పరివర్తన ప్రాజెక్టు (ఏపీఐఐఏటీపీ) తీసుకొచ్చింది. ప్రపంచబ్యాంక్ 80 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం నిధులు భరించేలా సంయుక్తంగా చెరువుల నిర్మాణం చేపట్టారు. ఇందులో స్వతంత్ర, గొలుసుకట్టు చెరువులు, వంద ఎకరాలకు పైగా ఉన్న పెద్ద చెరువులు, చిన్న చెరువుల నిర్మాణ పనులు ఉన్నాయి. అందులో భాగంగానే జిల్లాలో 98 చెరువులు అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

ఐదు విభాగాల సహకారం..

వాతావరణంలోని మార్పులను తట్టుకుని వ్యవసాయ ఉత్పాదకతను, ఆదాయాన్ని పెంచే విధంగా రైతులు పంటలను పండించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని విస్తృతం చేశారు. వ్యవసాయ శాఖ, భూగర్భజల శాఖ, నీటిపారుదల శాఖ, ఉద్యావన శాఖ, మత్స్యశాఖ కలిసి సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకంలో చెరువుల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. 100 ఎకరాల నుంచి 150 ఎకరాలకు సరిపడా నీరు నిల్వ ఉంచుకునేందుకు వీలుగా చెరువులను అభివృద్ధి చేస్తారు. నీటి లభ్యతను రైతులు అంచనా వేసుకోవడానికి, బోరు బావులలో నీరు సమృద్ధిగా ఉండేటట్లు ఈ పథకంలో చర్యలు తీసుకుంటారు. పిజో మీటర్ డ్రిల్లింగ్ చేసి నీటి సాంద్రతను నెల నెలా తెలుసుకోవచ్చు.

'కూటమి' నిర్లక్ష్యం.. రైతులకు శాపం

ఏపీ సమీకృత సేద్య, వ్యవసాయ పరివర్తన ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో 50 చెరువుల పునరుద్ధరణ కోసం ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సహాయంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 80:20 నిష్పత్తిలో పనులు చేపట్టింది. వీటి కోసం రూ.33.46 కోట్లు మంజూరు చేసింది. వీటిలో 33 చెరువులకు గానూ రూ.20.84 కోట్లతో ఒప్పందాలు ఖరారయ్యాయి. పనులు ప్రారంభమయ్యాయి. మరో 17 చెరువులకు టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఆ టెండర్లు రద్దు చేశారు. వీటిలో ఒక్కో చెరువు నిర్మాణానికి రూ.30 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు కేటాయించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 7,232 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పనులు కొనసాగించకపోగా పలు టెండర్లను రద్దు చేసింది. 2025 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలన్న లక్ష్యంతో 2020లో శ్రీకారం చుట్టారు. అదేవిధంగా జపాన్‌లోని అంతర్జాతీయ సహకార సంస్థ ఆర్థిక సహాయంతో 20 మైనర్ ఇరిగేషన్ చెరువుల అభివృద్ధి కోసం రూ.8.43 కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో కోటి రూపాయలతో పనులు ప్రారంభమయ్యాయి. మరికొన్ని టెండర్ దశలోనే ఉన్నాయి.

చెరువుల ద్వారా వ్యవ'సాయం'

గ్రామాలలో వ్యవసాయానికి తోడ్పాటు అందించేవి చెరువులే. వర్షాలు పడేటప్పుడు నీరు నిల్వ ఉండేందుకు గ్రామాల్లో చెరువులు ఉపయోగపడతాయి. ఈ చెరువుల అభివృద్ధి, నిర్మాణ పనులతో పంటల దిగుబడి పెరిగి రైతుకు మేలు జరుగుతుంది. అంతేకాకుండా వ్యవసాయనికి నీరందించే బోరు బావులలో వేసవి సమయాల్లో నీరు అడుగంటకుండా సహాయపడుతుంది. భూగర్భజలాలను నిల్వ చేయడానికి, వాటితోపాటు చేపల పెంపకానికి దోహదపడుతుంది. మరింత ఆదాయవనరులను పెంచుతుంది. ప్రధానంగా వ్యవసాయ సాగునీటి విస్తీర్ణం పెంచుకోవచ్చు. 20 శాతం కన్నా పనులు తక్కువైన చెరువుల వివరాలు ప్రభుత్వానికి పంపాం.

– రాజేశ్వరరావు, ఈఈ, భూగర్భ జలవనరుల శాఖ

టీడీపీ సర్పంచ్ భర్త వేధింపులపై హోంమంత్రికి ఫిర్యాదు



ఫిర్యాదురాలు అన్నం కాంతం

ఎస్.రాయవరం: జీవీ పాలెం గ్రామంలోని తన భూమిలో మట్టిని ప్రస్తుత టీడీపీ సర్పంచ్ భర్త, మాజీ సర్పంచ్ వజ్రపు శంకరరావు దౌర్జన్యంగా తరలించుకుపోతున్నాడని గ్రామానికి చెందిన అన్నం కాంతం ఓ వీడియో ద్వారా రాష్ట్ర హోంమంత్రి అనితకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. 2016 నుంచి తన భూమిలోకి అక్రమంగా చొరబడి గ్రావెల్ తరలించుకుపోయి సొమ్ము చేసుకున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. రూ.50 వేలు వ్యయంతో నిర్మించుకున్న రేకుల షెడ్డును కూడా శంకరరావు కూల్చివేసి తనకు ఆర్థికంగా నష్టాన్ని చేకూర్చాడని ఆమె ఆరోపించారు. ఈ సమస్యలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తాను పోలీస్ స్టేషన్‌కు వెళ్లే లోపే ఫిర్యాదు తీసుకోవద్దని అధికారం అండతో అడ్డుపడుతున్నాడని ఆమె వాపోయారు. పోలీసులు కూడా న్యాయ, అన్యాయాలు పరిశీలించకుండా కూటమి పార్టీ నేత అయిన శంకరరావుకే వత్తాసు పలుకుతున్నారన్నారు. ఈ మేరకు హోంమంత్రికి ఫిర్యాదు చేస్తున్నట్టు ఆమె చెప్పారు. హోంమంత్రి అండదండలు తనకు మెండుగా ఉన్నాయని, గ్రామంలో ఏ చేసినా చెల్లిపోతుందని శంకరరావు రెచ్చిపోతున్నాడన్నారు. ఇటీవల గ్రామ సభలో తాను ఫిర్యాదు చేస్తే సర్పంచ్ దురుసుగా ప్రవర్తించాడని, ఆ ఘటనను తన మనవడు వీడియో తీస్తే, రూ.20 విలువ చేసే మొబైల్ లాక్కుని పోయాడని చెప్పారు. ఇప్పటికైనా హోంమంత్రి పరిశీలించి శంకరరావు ఆకృత్యాలకు అడ్డుకట్ట వేసి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 8 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 8 వినతులు వచ్చాయి. సిటీ ప్లానర్ మీనాకుమారి ఫిర్యాదులు స్వీకరించారు. జోన్-1 నుంచి ఒకటి, జోన్-2 నుంచి 2, జోన్-3 నుంచి ఒకటి, జోన్-4 నుంచి ఒకటి, జోన్-5 నుంచి 2, జోన్-7 నుంచి ఒక్క ఫిర్యాదు అందింది.

ఎన్‌ఎంయూ కార్యాలయంపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి



కార్యాలయం ఆవరణ, ఫ్లెక్సీలను ధ్వంసం

ఎంవీపీకాలనీ: వాల్తేర్ ఆర్టీసీ డిపో ఎన్‌ఎంయూ కార్యాలయంపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసినట్లు ఆ సంస్థ డిపో చైర్మన్ బండి రవి తెలిపారు. గురువారం రాత్రి డిపో ఆవరణలో ఉన్న తమ కార్యాలయంపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి ఫర్నిచర్, కార్యాలయ ప్రాంగణాన్ని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కార్యాలయం సిబ్బంది వచ్చి చూడగా పరిసరాలు చిందరవందరగా ఉండటంతో కుర్చీలు, ఇతర ఫర్నీచర్ వస్తువులు ధ్వంసమై ఉన్నాయన్నారు. ఫ్లెక్సీని సైతం చించేశారన్నారు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఎన్‌ఎంయూ డిపో యాజమాన్యంపై అక్కసుతోనే ఈ దాడికి పాల్పడినట్లు సంస్థ డిపో కార్యదర్శి వసంతరావు పేర్కొన్నారు.

చెరువు గర్భంలో రోడ్డు తొలగింపు

- క్వారీ నిర్వహణలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
- రోలుగుంట తహసీల్దార్ నాగమ్మ హెచ్చరిక



చెరువు గర్భంలో రహదారిని తవ్వి ట్రెంచ్‌లు ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దార్ నాగమ్మ

రోలుగుంట: క్వారీ నుంచి రాయి తరలింపు కోసం మండలంలోని రాజన్నపేట పొలాలకు సాగునీరు అందిస్తున్న చెరువు గర్భంలో నిర్మించిన రహదారిని రోలుగుంట తహసీల్దార్ ఎస్.నాగమ్మ శుక్రవారం తొలగించారు. వివరాలిలా ఉన్నాయి. రాజన్నపేట గ్రామానికి చెందిన పొలాలకు 57/2 సర్వే నంబరులోని భూపతి చెరువు నుంచి సాగునీరు అందుతుంది. గతేడాది రాజమండ్రికి చెందిన ఓ వ్యక్తి సమీపంలోని కొండ ప్రాంతంలో క్వారీ నిర్వహణకు అనుమతి పొందారు. అక్కడి నుంచి రాయిని తరలించడానికి మార్గం లేక చెరువు గర్భంలో రహదారి ఏర్పాటు చేసుకొని యథేచ్ఛగా లారీలతో రాయి తరలింపునకు శ్రీకారం చుట్టాడు. భారీ బండ రాళ్లను రాంబల్లి మండలంలో తలపెట్టిన నేవల్ బేస్ నిర్మాణ పనులకు తరలిస్తున్నారు. దీంతో ఇక్కడ రైతులు తమ భూములకు జరుగుతున్న నష్టాన్ని నిర్వాహకుడికి పలు దఫాలు మొరపెట్టుకున్నారు. చెరువును ఆక్రమించి రోడ్డు వేయడం తగదని అడ్డగించినా ఫలితం లేదు. దీంతో ప్రజాప్రతినిధులు, కలెక్టర్, నర్సీపట్నం ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయంలో సైతం రైతులు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో రమణ ఈ ప్రాంతాన్ని గత వారం తహసీల్దార్ నాగమ్మతో కలిసి సందర్శించి వాస్తవాలపై విచారణ చేపట్టారు. ఈ మేరకు ఇక్కడ చెరువును ఆక్రమించి ఏర్పాటు చేసిన రహదారిని తొలగించి, క్వారీ నిర్వహణలో నిబంధనలు పాటించాలని నోటీసులు జారీ చేశారు. దీనిలో భాగంగా శుక్రవారం మండల సర్వేయర్ నాయుడు, ఆర్.రామమూర్తి, వీర్వో శ్రీనివాస్‌తో కలిసి క్వారీ వద్దకు వెళ్లారు. చెరువు గర్భాన్ని ఆక్రమించి మెటల్, రాతి బుగ్గితో ఏర్పాటు చేసిన రోడ్డును పొక్లెయిన్‌తో తొలగించి, ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగానే క్వారీ నిర్వహణ ఉండాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కుక్క దాడిలో ఉపాధి కూలీకి గాయాలు



పెదగోగాడ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న దేముడమ్మ

చీడికాడ: మండలంలోని జె.బి.పురంలో పిచ్చికుక్క దాడిలో ఓ ఉపాధి కూలీకి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన రామిశెట్టి దేముడమ్మ ఓ చెరువులో ఉపాధి పనులు చేస్తుండగా అటుగా వచ్చిన పిచ్చికుక్క దాడి చేసింది. దేముడమ్మ చేతులు, కాళ్లపై విచక్షణా రహితంగా గాయపరిచింది. పక్కనే ఉన్న తోటి కూలీలు కుక్కను తరమడంతో ప్రమాదం తప్పింది. బాధితురాలిని కుటుంబ సభ్యులు పెదగోగాడ పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. వైద్యుల సలహా మేరకు చోడవరం సీహెచ్‌సీ మెరుగైన వైద్యం కోసం తరలించినట్లు సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



చెట్టుకు వేలాడుతున్న గణేష్ మృతదేహం

మాకవరపాలెం: అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాకవరపాలేనికి చెందిన లంక గణేష్(26) ఆరేళ్ల క్రితం తూటిపాలకు చెందిన శీరంరెడ్డి సుధారాణిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. గణేష్ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజులుగా గణేష్ అత్తగారిల్లు అయిన తూటిపాలలోనే ఉంటున్నాడు. గురువారం మాకవరపాలెం వచ్చి మళ్లీ సాయంత్రం తూటిపాల వెళ్లాడు. శుక్రవారం ఉదయం సమీప జీడితోటలో ఉరివేసుకుని మరణించి కనిపించాడు. స్థానికులు అందించిన సమాచారంతో ఎస్‌ఐ దామోదర్‌నాయుడు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మృతుడి తల్లి నూకరత్నం ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య, ఐదేళ్ల ఏళ్ల కుమారుడు ఉన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

- మృతుడు దొడ్డి శేఖర్‌ది అనకాపల్లి

ఆరిలోవ(విశాఖ): మద్యం పూటుగా తాగిన మత్తులో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా.. అనకాపల్లిలో నివసిస్తున్న దొడ్డి శేఖర్(40) అనే వ్యక్తి శుక్రవారం విశాఖపట్నంలోని ఆరిలోవ బాలాజీనగర్‌లో నివసిస్తున్న తల్లి వద్దకు వచ్చాడు. ఇంటికి వెళ్లే సమయానికే పూటుగా మద్యం తాగి ఉన్నాడు. మద్యం మత్తులో మధ్యాహ్నం వాంతులు చేసుకున్నాడు. అనంతరం నిద్రపోయాడు. సాయంత్రం ఎంతకీ నిద్ర నుంచి లేవలేదు. దీంతో తల్లి అతడిని నిద్ర లేపినా లేవలేదు సరికదా.. శేఖర్ శరీరంలో చలనం కనిపించలేదు. వెంటనే స్థానికుల సహాయంతో తల్లి తన కొడుకును విమ్స్‌కు తరలించింది. అప్పటికే శేఖర్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శేఖర్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ సీఐ హెచ్.మల్లేశ్వరరావు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారని సీఐ తెలిపారు.

ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలు



చిన్నారి వికసితకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యురాలు రమ్య

బుచ్చెయ్యపేట: ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. శుక్రవారం వీరవల్లి అగ్రహారం నుంచి సురవరం గ్రామం వెళ్తుండగా మధ్యలో మలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఏడుగురు ఉండగా.. ముగ్గురికి గాయాలయ్యాయి. వృద్ధురాలు కె.సత్యవతి, మూడేళ్ల వయసున్న బాలుడు నానాజీ, బాలిక వికసిత గాయపడ్డారు. వీరిని వడ్డాది ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారిణి రమ్య వారికి వైద్య సేవలు అందించారు.

భారత సైనికులకు మద్దతుగా సంఘీభావ యాత్ర



సంఘీభావ యాత్రలో పాల్గొన్న న్యాయవాదులు

విశాఖ లీగల్ : భారత సైనికుల వీరోచిత పోరాటానికి సంఘీభావంగా విశాఖ న్యాయవాదులు ప్రదర్శన నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కోర్టు ప్రధాన గేట్ నుంచి జగదాంబ వరకు ప్రదర్శన నిర్వహించారు. అఖిల భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ సంఘీభావ ప్రదర్శన అఖిల భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.రామాంజనేయులు మాట్లాడుతూ భారత సైన్యం శత్రుసేనపై చేస్తున్న పోరాటానికి తాము జాతీయ స్థాయిలో మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నూకల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వంలో జరుగుతున్న సింధూర పోరాటానికి న్యాయవాదులందరూ సంఘీభావం ప్రకటించారన్నారు. కార్యక్రమంలో వందలాదిగా న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే కోర్టు ప్రధాన గేటు దగ్గర ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామాంజనేయరావు, వెంకటేశ్వరరావు, అల్లు సురేష్, మణి, భవాని, శ్రీధర్, చిట్టిబాబు, శ్రీరామ్మూర్తి, ఆనందరెడ్డి, ఎస్.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫిర్యాదులను పరిష్కరించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి సుభాషిణి

కశింకోట: ఫిర్యాదులపై విచారణ జరిపి, వాస్తవాలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సుభాషిణి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమి వివాదాలకు సంబంధించి నాలుగు ఫిర్యాదులు పరిష్కారం కోసం వచ్చాయి. వాటిని పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఉప తహసీల్దార్ కుమారస్వామి, సీఐ అల్లు స్వామినాయుడు పాల్గొన్నారు.

బుద్ధుని జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు

అనకాపల్లి టౌన్: గౌతమ బుద్ధుని జయంతి సందర్భంగా ఆరు నుంచి పదవ తరగతి విద్యార్థులకు బుద్ధుని జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలను నిర్వహిస్తున్నట్లు సిద్ధార్థ సోషల్ సర్వీస్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లా నాగ భూషణం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు తెలుగులో నాలుగు పేజీలకు మించకుండా వ్యాసం రాసి 8977020615 అనే ఫోన్ నంబర్‌కు ఈనెల 12వ తేదీలోగా వాట్సప్ చేయాలని సూచించారు. విజేతలకు ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి కల్యాణం



సత్యనారాయణస్వామి కల్యాణంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళీ దంపతులు

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద గల సత్యనారాయణ, సూర్యనారాయణ స్వామి దేవాలయంలో వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని రమా సమేత సత్యనారాయణస్వామి కల్యాణాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచి స్వామివారికి సుప్రభాతసేవ, విష్ణు సహస్రనామ అర్చన, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళీ దంపతులు కల్యాణం జరిపారు.
ఆలయానికి వచ్చిన భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 335 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,240	4,900
రెండవ రకం	4,200	4,290
మూడవ రకం	3,650	3,800

అనకాపల్లి సినిమాలు

రాజా : రెట్రో
సత్యనారాయణ స్క్రీన్-1:శుభం
సత్యనారాయణ స్క్రీన్-2:
జగదీక వీరుడు అతిలోక సుందరి
పర్తిసాయి :హిట్-3
షిర్డీసాయి సింగల్
వెంకటేశ్వర :సీఎం పెళ్లాం
శ్రీ సత్య : సారంగపాణి జాతకం
రామచంద్ర :తుడురుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్ 17 యూనిట్లు, బి పాజిటివ్ -14 యూనిట్లు, ఒ పాజిటివ్ -22 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ య. లోకేష్(ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 342 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 317 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (ఫోన్ నంబర్ 08924-223595)ను సంప్రదించవచ్చు.



చెరువులో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

ఉపాధి కార్మికులకు బీమా.. ధీమా

పొట్టకూటికోసం ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు ప్రాణాలు కోల్పోయే సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అనారోగ్యం, పనుల వద్ద వడదెబ్బకు గురైన సమయంలో మరణిస్తున్నారు. కుటుంబ పెద్ద మృతితో భార్యా బిడ్డలు రోడ్డుపాలవుతున్నారు. ఇటువంటి వారికి శాఖాపరంగా అందించే పరిహారం రూ.50 వేలు మాత్రమే. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఉపాధి కార్మికులకు బీమా పథకం వర్తింపజేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది.



తుమ్మపాల: కూలీలు దురదృష్టవశాత్తు మరణించినా...ప్రమాదం కారణంగా వైకల్యానికి గురైనా బీమా పథకాల ద్వారా రక్షణ పొందవచ్చు. దీని కోసం ప్రధాన మంత్రి సురక్ష బీమా, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా అనే రెండు పథకాలను వర్తింపజేస్తున్నారు.
సురక్ష బీమా యోజన: 18-70 సంవత్సరాల మధ్య వయస్సు వారు అర్హులు. ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లించాలి. ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి వైకల్యానికి గురైనా రూ. 2లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.లక్ష చెల్లిస్తారు.
జీవనజ్యోతి బీమా యోజన : 18-50 ఏళ్ల వారు అర్హులు. రూ.436 ప్రీమియం ప్రతి ఏడాది చెల్లించాలి. మరణిస్తే రూ.2 లక్షల పరిహారం అందజేస్తారు. రాష్ట్రీయ స్వస్థ బీమాయోజన కింద ప్రీమియం చెల్లిస్తే పలు రకాల ప్రమాదాలకు బీమా లభిస్తుంది.

జాబ్ కార్డుదారులందరికీ బీమాను అమలు చేయనున్నారు. అనకాపల్లి మండలంలో దాదాపు 14వేల జాబ్ కార్డులున్నాయి. వీరిలో ఉన్న 10వేల మంది వేతనదారులకు బీమా సౌకర్యం కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎఫ్ఎ, మేట్ అందజేసే దరఖాస్తుపై వేతనదారులు సంతకం చేసి, అప్పగిస్తే బ్యాంకు ఖాతాల నుంచి ప్రీమియం మినహాయించుకుంటారని అధికారులు తెలిపారు. అయితే ఈ పథకం వర్తింపజేసేందుకు వేతనదారులు కూడా చొరవ చూపి అధికారులకు సహకరించాల్సి ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పథకంలో **జాబ్ కార్డు కలిగిన వేతనదారులందరూ విధిగా బీమా** సౌకర్యం పొందాలి. **బ్యాంకు ఖాతాల నుంచి ప్రీమియం చెల్లింపు జరుగుతుంది.** ఎవరికీ నేరుగా నగదు చెల్లించాల్సిన **అవసరం ఉండదు. అందరూ నమోదు చేసు**కునేలా అవగాహన కల్పిస్తున్నాం. ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
– నరసింగరావు, ఎంపీడీవో, అనకాపల్లి మండలం.

కూలీల కుటుంబాలకు అండగా

కూలీల్లో వయసు మళ్లిన వారు, అనారోగ్య సమస్యలున్న వారు అనేక మంది ఉన్నారు. ప్రస్తుతం వేసవి కారణంగా ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. వడ దెబ్బ, ఇతర కారణాలతో మృతి చెందితే బీమా వర్తిస్తుంది. వారి కుటుంబాలకు నగదు సాయం ఆసరాగా ఉంటుందని ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు. యుద్ధప్రాతిపదికన జాబ్ కార్డు ఉన్న ప్రతి వేతనదారుడు బీమా ప్రీమియం చెల్లించాలని కోరుతున్నారు. రెండు రకాల బీమా పథకాలను కూలీలు పొందాలని సూచించారు. దీనిపై మండల, గ్రామ సమావేశాలు పెట్టి అవగాహన కల్పిస్తున్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత



మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న అదనపు ఎస్పీ దేవప్రసాద్

అనకాపల్లి: నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మృతిచెందిన మహిళా కానిస్టేబుల్ **డి.దుర్గాభవాని తల్లి చందక రాధ,** పిల్లలకు **పోలీస్ భద్రత ఎక్స్‌గ్రేషియా కింద** మంజూరైన **రూ.4లక్షల చెక్కును ఎస్పీ కార్యాలయం**లో అద**నపు ఎస్పీ ఎం.దేవప్రసాద్** శుక్రవారం అందజే**శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయి**న సిబ్బంది **కుటుంబాలకు పోలీసు శాఖ శాఖ ఎప్పు**డూ అం**డగా ఉంటుందన్నారు.**

పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ పూర్తి

కశింకోట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తి అయిందని, రైతులకు త్వరితగతిన పారదర్శకమైన సేవలందుతాయని జిల్లా సహకార శాఖ అధికారి ఎ.ప్రేమ స్వరూప రాణి తెలిపారు. ఈ-పీఏసీఎస్ ఆడిట్ నిర్వహించేందుకు ఆడిట్ మాడ్యుల్‌పై సహకార శాఖ ఆడిటర్లు, చార్టెర్డ్ అకౌంటెంట్లకు కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో ఆచరణాత్మక శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంప్యూటరీకరణలో జిల్లా రాష్ట్రంలో నాలుగవ స్థానంలో నిలిచిందన్నారు. ఆడిటర్లంతా పీఎసీఎస్ ఆడిట్‌ను ఈ-ఆడిట్ ప్రక్రియలో పూర్తి చేయాలన్నారు. యలమంచిలి డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి పి.ఎస్.ఎల్. కిరణ్‌కుమారి, అనకాపల్లి డీపీడీఎం శ్రీవిద్య, సహకార శాఖ ఆడిటర్లు, చార్టెర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



బయ్యవరంలో రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు



కశింకోటలో వాహనాల తనిఖీ

కశింకోట: ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు గురువారం అర్ధరాత్రి నుంచి పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ ఎం. శ్రావణి పర్యవేక్షణలో సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది కశింకోట, బయ్యవరం, తాళ్లపాలెం కూడలి ప్రాంతాల్లో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీలు కొనసాగుతాయని సీఐ తెలిపారు.

యుద్ధంలో భారత్ విజయం సాధించాలని పూజలు

అనకాపల్లి టౌన్: యుద్ధంలో పాకిస్తాన్‌పై మన దేశం విజయం సాధించాలని గాంధీనగరం వేంకటేశ్వర స్వామి ఆలయంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో యుద్ధంలో మన సైన్యం పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. యుద్ధం సందర్భంగా మరణించిన భారతీయులకు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఉడా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి



తాము గీసిన చిత్రాలతో విద్యార్థులు

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ మారిశెట్టి వెంకటప్పారావు తెలిపారు . మండలంలోని గవర్ల అనకాపల్లిలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిత్ర లేఖనంలో రాణించడం ద్వారా సృజనాత్మకతను పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. మెదడు పని తీరును మెరుగుపరుస్తుందన్నారు. ఇటువంటి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్న అనకాపల్లి జిల్లా చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ జ్యోతిర్మయి, క్లబ్ కన్వీనర్ బి.ఉమామహేశ్వరరావు, ఆళ్ల మహేశ్వరరావు, పెంటకోట వెంకటరావు, ఆడారి రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న విజయ్ ప్రకాష్

పాయకరావుపేట: శ్రీప్రకాష్‌లో 15 రోజులుగా విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. విద్యార్థులకు యోగా, స్పోకెన్ ఇంగ్లిష్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సంగీతం, స్కేటింగ్, కంప్యూటర్ బేసిక్స్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, తదితర ఆటల్లో నిష్ణాతులైన కోచ్‌లతో మెలకువలు నేర్పారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాల్లో నేర్చుకున్న మెలకువలను విద్యార్థులు నిరంతరం కొనసాగించాలని సూచించారు. అనంతరం క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్.మూర్తి, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యకర పంటలు



ప్రకృతి సేద్యంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



రైతులను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

ఎస్.రాయవరం: ప్రకృతి సేద్యంతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు రావడమే కాకుండా ఆరోగ్యకరమైన ఫలాలు వస్తాయని తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపురం శివారు గోకులపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సాగు మెలకువలు వివరించారు.
రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు ఉపయోగించి పంటలు సాగు చేయాలని సర్పంచ్ సూచించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ రైతులను ఘనంగా సత్కరించారు. పూర్వం పంటలకు సాగు ఉపయోగించే ఎరువులను వారి మాటల్లో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ విస్తరణాధికారి ధనరాజ్, ఎంపీటీసీ నాగబోయిన శ్రీనివాసరావు, గ్రామ ఉప సర్పంచ్ అద్దేపల్లి బాబూరావు, స్థానిక నాయకుడు లక్ష్మీనారాయణ, వెలుగు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం.. వినోదం.. ఆధ్యాత్మికం

- విద్యార్థులకు హరేకృష్ణ మందిర్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్



భక్తి గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు



భగవద్గీత శ్లోకాలు చదువుతున్న విద్యార్థులు



యోగా నేర్చుకుంటున్న బాలలు



చిత్రలేఖనం నేర్చుకుంటున్న విద్యార్థి

అనకాపల్లి టౌన్: వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆటలు, విహారయాత్రలు, వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఎక్కువ శాతం పిల్లలు ఆటలపై దృష్టి సారిస్తుంటారు. ఇంకొందరైతే సమ్మర్ క్యాంప్‌లకు వెళ్లి వివిధ అంశాలపై శిక్షణ పొందేందుకు ఇష్టపడతారు. ఈ క్రమంలోనే పలువురు విద్యార్థులు విజ్ఞాన, ఆధ్యాత్మిక, సృజనాత్మకత పెంచే శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అనకాపల్లి వేల్పులవీధిలో హరేకృష్ణ మందిర్ ఆధ్వర్యంలో వేసవి క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఐదు సంవత్సరాల నుంచి 15వ సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్థులకు ఈ నెల 15వ తేదీ వరకు 15 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. ప్రాతస్మరణీయ శ్లోకాలు, భగవద్గీత చదవడం, మెడిటేషన్, ఆధ్యాత్మిక కీర్తనలు, డ్యాన్స్, శ్రద్ధగా ఎలా చదవాలి, చిత్రలేఖనం, బొమ్మల తయారీ, ఎదుట వారితో ఎలా మసులుకోవాలి, గోకులంలో కృష్ణుని ఆటలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు క్యాంప్ నిర్వహిస్తున్నారు. అనంతరం విద్యార్థులకు ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. ఈ క్యాంప్‌లో 40 మంది శిక్షణ పొందుతున్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యం



పిల్లలందరూ సెల్‌ఫోన్లకు బానిసలవుతున్నారు. దీనికి ముఖ్య కారణం తల్లిదండ్రులే. సమాజానికి పనికి వచ్చే విధంగా ఇప్పటి నుంచే ఆలోచనలు చేసేలా విద్యార్థులను తీర్చిదిద్దడం ఈ క్యాంప్ ముఖ్య ఉద్దేశం. ఇక్కడ నేర్చుకున్న అంశాలు జీవితాంతం ఉపయోగపడతాయి. –దుర్లభ కృష్ణ ప్రేమ దాస్, హరేకృష్ణ సత్సంగ ఆశ్రమం అధ్యక్షుడు, అనకాపల్లి

మంచి విషయాలు నేర్చుకుంటున్నాను



భగవంతుడని ప్రార్థించడం వల్ల కలిగే ఉపయోగాలు తెలుపుతున్నారు.పెద్దవారిని ఎలా గౌరవించాలి, వారితో ఎలా మాట్లాడాలి తదితర ఎన్నో మంచి విషయాలపై అవగాహన వచ్చింది.
–హారిణి, విద్యార్థిని అనకాపల్లి

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం



వెదురువాడలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీష

మునగపాక: పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నట్టు వెంకటాపురం పాల సంఘం అధ్యక్షుడు సుందరపు కాసులుబాబు పేర్కొన్నారు. వెంకటాపురం పాల సంఘ మొదటి అంతస్తు భవనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం రైతులకు సిల్వర్ బేసిన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా విశాఖ డెయిరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాడి రైతులు పశువుల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ సుందరపు తాతాజీ, మాజీ సర్పంచ్ కనకప్పారావు, డెయిరీ సివిల్ ఇంజినీర్ వెలగా సురేష్‌కుమార్, జేవో రమణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జ్యోతిష్యుడు నూకరాజు మృతి



తుమ్మపాల: ప్రముఖ జ్యోతిష్యుడు బుద్ద ఎ.వి.వి.నూకరాజు (77) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన విశాఖలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. సుదీర్ఘ కాలం జ్యోతిష్య పండితులుగా అనేక వేదికలను నిర్వహించి గుర్తింపు పొందారు.పలువురు శిష్యులను తయారుచేశారు. ఆయన మునగపాక మండలం తోటాడ -గవర్ల అనకాపల్లిలో నివాసముంటున్నారు. శనివారం స్వగ్రామంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

అభివృద్ధి ప్రణాళిక తయారు చేయండి



గ్రామాల్లో అభివృద్ధి పనులపై మండల అధికారులను అడిగి తెలుసుకుంటున్న శచీదేవి

పాయకరావుపేట: విజన్-2047పై అధికారులు ప్రణాళిక తయారు చేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి డాక్టర్ శచీదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే 5 ఏళ్లలో గ్రామాల్లో ఏయే పనులు చేపడితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది అనే విషయాలపై అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, వ్యవసాయం, సాగునీరు, ఉద్యానవనం, రోడ్లు, డ్రైనేజీలు, తదితర సమస్యలపై దృష్టి సారించి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఆయాల శాఖల అధికారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ రాజశేఖర్, ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావు, ఈవోఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.